# సాక్షి
## జోగులాంబ గద్వాల

మంగళవారం, 18, జూన్, 2024




**అటవీ పార్కు ముస్తాబు**
నల్లమల అటవీ అందాలను వీక్షించేందుకు మరో వ్యూపాయింట్ సిద్ధమైంది.

వివరాలు 8లో ▸



**భయం.. భయం**
ఫతేపూర్ అడవిలో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /26.3

**వాతావరణం**
ఉదయం వేళలో ఆకాశం కొద్దిమేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### జోగుళాంబ సన్నిధిలో కర్నూలు కలెక్టర్



**జోగుళాంబ శక్తిపీఠం:** అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సోమవారం కర్నూలు కలెక్టర్ సృజన దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అర్చకులతో కలిసి ఘనస్వాగతం పలికారు. అనంతరం బాలబ్రహ్మేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి శేషవస్త్రాలతో కలెక్టర్‌ను సత్కరించారు.

### ఆదిశిలా క్షేత్రంలో అదనపు కలెక్టర్ పూజలు



**మల్దకల్:** ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో వారిని సత్క రించి, మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, అరవిందరావు, బాబూరావు పాల్గొన్నారు.

### 'ఆరోగ్యశాఖలో బదిలీలు చేపట్టాలి'

**పాలమూరు:** ఆరోగ్యశాఖ అన్ని కేటగిరిలలో బదిలీలు చేపట్టాలని, పీఆర్‌సీ పదోన్నతులు అమలు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. వైద్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

# మిరప సాగుపై తెగుళ్ల ప్రభావం

## ఈ ఏడాది 50 వేల ఎకరాలకు పడిపోయిన సాగు అంచనా



మానవపాడు శివారులో మిరప సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

- 15వేల ఎకరాల వరకు తగ్గనున్న పంటసాగు విస్తీర్ణం
- రైతులను వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- రెండేళ్లుగా దిగుబడులు లేక నష్టాలు
- ఇతర పంటల వైపు అన్నదాతల దృష్టి

**గద్వాల వ్యవసాయం:** ఈఏడాది జిల్లాలో మిరప పంట 50వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు అంచనాకు వచ్చారు. గడిచిన ఏడాది పలు తెగుళ్లకు తోడు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. దీంతో ఈఏడాది దాదాపు 15వేల ఎకరాల్లో ఎండుమిర్చి సాగు తక్కువయ్యే అవకాశం కనిపిస్తోంది. అయితే గతేడాదిలో జరిగిన నష్టాన్ని దిగమింగుకొని, ఈఏడాది ఎండుమిర్చి సాగుకు అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు.

**జిల్లాలో మిరప సాగు అంచనా..**

| మండలం | సాగు (ఎకరాల్లో) |
|---|---|
| అలంపూర్ | 2,202 |
| ఇటిక్యాల | 11,945 |
| మానవపాడు | 8,682 |
| ఉండవెల్లి | 4,679 |
| ధరూరు | 349 |
| గద్వాల | 5,700 |
| కేటీదొడ్డి | 169 |
| మల్దకల్ | 3,600 |
| గట్టు | 4,505 |
| అయిజ | 5,586 |
| రాజోళి | 1,354 |
| వడ్డేపల్లి | 1,209 |



**ఎకరాకు రూ. 60వేల వరకు ఖర్చు..**

14 ఏళ్లుగా ఇక్కడి రైతులు ఎండుమిర్చి సాగుపై దృష్టి సారిస్తున్నారు. బోర్లు, బావుల కింద, నల్లరేగడి భూముల్లో వర్షాధారంపై మిరప సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించి పంట సమృద్ధిగా చేతికి వస్తే, పత్తి కన్నా మంచి ధరలు లభిస్తాయని రైతులు పేర్కొంటున్నారు. మిరప పంట కాలం నాలుగు నెలలు. పంట కోత తర్వాత కల్లాంలో బాగా ఆరబెట్టి విక్రయిస్తారు. ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ. 60 వేల వరకు సాగు ఖర్చులు అవుతాయి. కరుణ, సూపర్‌టెన్, జిత్రి, కావేరి తదితర రకాలను ఈప్రాంతంలో ఎక్కువగా రైతులు సాగుచేస్తున్నారు.

### ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక..

**రెండేళ్ల నుంచి మిరప పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో ఈఏడాది సాగు తగ్గే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉండటం.. దిగుబడులు తక్కువగా వస్తుండటం కారణంగా చెప్పవచ్చు. గతేడాదితో పోల్చితే ఈఏడాది దాదాపు 15 వేల ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మిరప పంటకు స్థానంలో పత్తి ఇతర పంటలు** సాగుచేసే అవకాశం ఉంది.

### విత్తనాలు వేసేందుకు సన్నద్ధం..

నడిగడ్డలో మిరప పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అలంపూర్ ప్రాంతానికి చెందిన చాలా మంది రైతులు కర్నూలు నుంచి విత్తనాలు తెచ్చుకుంటున్నారు. గద్వాల ప్రాంతంలోని రైతులు స్థానికంగా కొనుగోలు చేస్తున్నారు. కంపెనీ, వైరటీల గురించి రైతులు అన్ని వివరాలు తెలుసుకొని విత్తనాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, ఇప్పటికే రెండు, మూడు రోజుల క్రితం కొన్ని ప్రాంతాల్లో మిరప నారు మడుల్లో విత్తనాలు చల్లారు. ఇంకా కొన్ని చోట్ల నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. చాలా ప్రాంతాల్లో ఆరుద్ర కార్తెకు అంటే.. ఈనెల 22 నుంచి విత్తనాలు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈనెలాఖరు నుంచి మొదలు ఆగస్టు మొదటి వారం వరకు మిరప నారు నాటడం, విత్తనాలు వేస్తారని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### రెండేళ్ల నుంచి నిరాశ..

2022–23లో జిల్లావ్యాప్తంగా 36 వేల ఎకరాల్లో మిరప సాగుచేశారు. పంట బాగా వస్తుందనుకునే సమయంలో త్రిప్స్ తెగుళ్లు ఆశించాయి. దీంతో పంట దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. 2023–24లోనైనా వాతావరణం అనుకూలిస్తుందని రైతులు ఆశించారు. సకాలంలో వర్షాలు కురుస్తాయని భావించారు. అదేవిధంగా తెగుళ్లు కూడా పెద్దగా ఆశించవని అనుకున్నారు. ఆర్థికంగా లాభపడతామని భావించి, 65,113 ఎకరాల్లో సాగుచేశారు. అయితే గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఏ ఒక్క మండలంలో కూడా సగటు వర్షపాతం నమోదు కాలేదు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లు రైతులను ఆందోళనకు గురి చేశాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మిరప పంటకు త్రిప్స్, ఎండు, మడత తెగులు, జెమిని వైరస్ ఆశించాయి. అటు వాతావరణ పరిస్థితులు, ఇటు తెగుళ్లు పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఎకరాకు కేవలం 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది.

### సలహాలు తీసుకోవాలి..



రెండేళ్ల నుంచి తెగుళ్లు, వర్షాభావ పరిస్థితుల వల్ల మిరప పంట దిగుబడులు తగ్గాయి. వీటివల్ల ఈఏడాది సాగు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలోని రైతు లు మిరప సాగుకు సిద్ధమయ్యారు. అలంపూర్ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల విత్తనాలు వేశారు. మిరప సాగు చేసే రైతులు ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. – ఎంఏ అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# భక్తిశ్రద్ధలతో బక్రీద్



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



**గద్వాల:** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను సోమవారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు నమాజ్ చేయించారు. అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. గాంధీచౌక్ నుంచి ఈద్గా వరకు సందడిగా మారింది. ఈద్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ పురోగాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు

# జిల్లా పోలీస్ బాస్‌గా టి. శ్రీనివాసరావు

**నేడో.. రేపో బాధ్యతలు స్వీకరించే అవకాశం**

**గద్వాల క్రైం:** సైబరాబాద్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న టి.శ్రీనివాసరావును జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2013 బ్యాచ్‌కు చెందిన ఆయన.. సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్, చీటింగ్ కేసులు తదితర కేసుల పురోగతిలో ప్రత్యేకత చాటుకున్నారు. ఆయన ఒకట్రెండు రోజుల్లో జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా, వివిధ ప్రాంతాల్లో జరిగే నేరాల కంటే నడిగడ్డలో విభిన్న రీతిలో నేరాలు చోటు చేసుకుంటున్నాయి. చోరీలు, మహిళా వేధింపులు, భూదందా, ఇసుక, రేషన్ బియ్యం, పేకాట, మద్యం అక్రమ దందాలు, భూతగాదాల్లో హత్యలు, కేసుల వ్యవహారంలో వైట్ కాలర్ నాయకుల ప్రమేయం, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, నకిలీ విత్తనాలు, ఎరువుల వ్యాపారంతో పాటు పలు మోసపూరిత వ్యాపారులకు కేంద్ర బింధువుగా ఉంటుంది. రెండు రాష్ట్రాల సరిహద్దు కావడంతో నిత్యం అధికారుల కళ్లు గప్పి, అక్రమార్కులు చీకటి దందాలు చేస్తుంటారు. ఎప్పుడూ లేనివిధంగా సామాజిక వర్గం, ధనిక వర్గం అంటూ పలువురు నాయకులు తెరమీదకు తీసుకువచ్చారు. దీంతో ప్రజలు సైతం తలలు పట్టుకుంటున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కత్తిమీద సాములా మారింది. అయితే జిల్లాలోని పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వారే కావడం కాస్త సమస్యగా మారింది. సిబ్బంది ఏ చిన్న తప్పిదం చేసినా శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా వారికి జవాబుదారీగా ఉండే విధంగా సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఏడుగురు ఎస్పీలు ఇక్కడ విధులు నిర్వహించారు. ఫస్ట్ పోస్టింగ్ స్వీకరించిన ఎస్పీ విజయకుమార్ జిల్లా పోలీస్ శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశారు. పలు కీలకమైన కేసులను సైతం నమోదు చేసి, ప్రజల అభిమానం సొంతం చేసుకున్నారు. టి.శ్రీనివాస్ రావు బాధ్యతలు స్వీకరిస్తే, 8వ ఎస్పీగా జిల్లా ప్రజలకు సేవలు అందిస్తారు.



**శ్రీనివాస్ మార్క్ పడేనా..**

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న టి.శ్రీనివాసరావు మార్క్ ఉంటుందా.. లేదా అనే అంశంపై వేచి చూడాలి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ప్రస్తుతం నాయకుల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. మరోవైపు జాతీయ రహదారుల వెంట దారి దోపిడీలు చోటు చేసుకుంటున్నాయి. ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ దందాలు, నకిలీ పత్తి విత్తనాలు, ఆర్థిక నేరాలు, కల్లు, సారా, గంజాయి తదితర వాటిపై ఎస్పీ తీసుకోబోయే చర్యలు, కట్టడిపై తన మార్క్ ఎలా ఉంటుందో త్వరలో తేలనుంది. జిల్లా సమస్యలు, ఇక్కడి రాజకీయ వ్యూహాలపై ఎలా స్పందిస్తారో తెలియనుంది.

**8 నెలలపాటు ఎస్పీ రితిరాజ్ సేవలు..**

సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా నుంచి ఎస్పీ రితిరాజ్ బదిలీ అయ్యారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆమె గత అక్టోబర్ 13న జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి, తనదైన శైలిలో ప్రజలకు చేరువయ్యారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. దాదాపు ఎనిమిది నెలల నాలుగు రోజులపాటు ఎస్పీగా జిల్లా ప్రజలకు సేవలు అందించారు.

# ఇకనైనా తీరు మారేనా?

- ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యారోగ్యశాఖ విస్తృత తనిఖీలు
- బాలింత మృతితో కదిలిన అధికార యంత్రాంగం
- నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆస్పత్రులకు నోటీసులు
- చర్యల నుంచి తప్పించుకునేందుకు యాజమాన్యాల ప్రయత్నాలు

**గద్వాల క్రైం:** ఏదేని జబ్బుతో సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే చాలు.. వివిధ రకాల పరీక్షల పేరుతో బిల్లుల మోత మోయాల్సిందే. సదరు ఆస్పత్రిలోని మెడికల్ దుకాణంలో చెప్పిన ధరలకు మందులను కొనుగోలు చేయాల్సిందే. ఇక గర్భిణుల విషయం చెప్పనక్కర్లేదు. ప్రతినెలా పరీక్షల సమయంలో సాధారణ ప్రసవం అవుతుందని నమ్మకం కలిగించడం.. ప్రసవ సమయంలో మాత్రం తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాలని.. లేదంటే తల్లి, బిడ్డకు ప్రాణాప్రాయం ఉంటుందనే భయాన్ని కుటుంబ సభ్యుల్లో కలిగించడం పరిపాటిగా మారింది. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అనుసరిస్తున్న తీరును అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బాలింత మృతి చెందడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు.

**నిజాలు వెలుగులోకి వచ్చేనా..?**

గద్వాల మండలానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం ఈనెల 4వ తేదీన జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర చైల్డ్ అండ్ మదర్ ఆస్పత్రిలో అడ్మిట్ కాగా.. సిజేరియన్ చేశారు. ఈక్రమంలో బాలింత పరిస్థితి విషమంగా ఉందని కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీన ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై 11వ తేదీన సదరు ఆస్పత్రిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ప్రసవానికి ముందు గర్భిణి ఆరోగ్య పరిస్థితి, గర్భంలో బిడ్డ ఎదుగుదల తదితర స్కానింగ్ రిపోర్టులు, రక్త పరీక్షల వివరాలను సేకరించారు. శస్త్రచికిత్స చేసే సమయంలో గర్భిణి స్పందన, చికిత్స తర్వాత ఆమె పరిస్థితి తదితర విషయాలను వైద్యులతో ఆరా తీశారు. శస్త్ర చికిత్స కోసం తీసుకున్న మందుల కంపెనీ, ఎంత మోతాదులో మత్తు మందు ఇచ్చారు.? శస్త్ర చికిత్స అనంతరం బాలింతకు మెరుగైన చికిత్స ఇవ్వాల్సిన అవసరం ఉంటే, ఇక్కడే ఎందుకు ఇవ్వలేదు.? రెఫర్ చేయాల్సిన పరిస్థితిలు ఉన్నాయా.? లేక ఇక్కడి వైద్యులు చేసిన పొరపాట్లు ఏమైనా ఉన్నాయా.? గర్భిణి కుటుంబ సభ్యుల నుంచి ఎక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేద్దామనుకున్నారా.? అనే అంశాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబం డబ్బులు డిమాండ్ చేస్తే, ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడంపైనా విచారణ చేపట్టినట్లు తెలిసింది. అధికారుల విచారణకు సంబంధించి నిజాలు వెల్లడిస్తారా.? లేక బాలింత ఆరోగ్య పరిస్థితి వైద్యానికి సహకరించ లేదని చెప్పి చేతులు దులుపుకొంటారా అనే సందేహాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి.



బాలింత మృతిపై విచారణ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

**రోగుల నిలువు దోపిడీ..**

జిల్లా వ్యాప్తంగా 38 ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, 14 క్లినిక్‌లు, 12 దంత వైద్య ఆస్పత్రులు, 5 ఫిజియోథెరఫి, 79 డయాగ్నొస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో అనేక ఆస్పత్రులు వైద్యారోగ్యశాఖ అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. ఆస్పత్రుల్లోనే ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రకాల స్పెషలిస్టులు సైతం ప్రత్యేక తేదీల్లో అందుబాటులో ఉంటారని ప్రచార బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుందన్న ఉద్దేశంతో స్థానిక ఆస్పత్రులకు వచ్చే స్పెషలిస్టుల వద్దకు రోగులు వెళ్తున్నారు. ఈక్రమంలో మరో విధమైన దోపిడీకి తెర లేపుతున్నారు.

– ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు చర్మ సమస్యతో సంబంధిత స్పెషలిస్టు వద్దకు వెళ్తే.. వివిధ పరీక్షలు చేయించి, మందులు రాసిచ్చాడు. అందుకు ఆ యువకుడు రూ. 7వేలు చెల్లించాడు. ఇక ఇతర వ్యాధులను గుర్తించే వైద్యులకు రోగులు చెల్లించాల్సిన డబ్బుల గురించి చెప్పనవసరం లేదు. నాణ్యమైన కంపెనీ మందులు వాడితే త్వరగా జబ్బు తగ్గుతుందని చెప్పడం.. తమ దుకాణాలలో ఉండే మందులను రోగులకు అంటగట్టి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు.

### ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు..



ఈనెల 9న బాలింత మృతి ఘటనపై విచారణ చేపట్టాం. ఆస్పత్రిలో అందించిన చికిత్స, వైద్యుల వివరాలు, వైద్యపరీక్షలు తదితర అంశాలను తెలుసుకున్నాం. పూర్తి స్థాయి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. వారి ఆదేశాల మేరకు సంబంధిత ఆస్పత్రిపై చర్యలు ఉంటాయి. జిల్లాలోని అనుమతి లేని క్లినిక్‌లు, ఆస్పత్రిలు, డయాగ్నొస్టిక్ సెంటర్లను తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆస్పత్రిల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎవరి ప్రమేయం ఉన్నా చర్యలు తప్పవు. సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై సైతం విచారణ చేపడుతాం. – శశికళ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

### విస్తృతంగా తనిఖీలు..

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు కొన్ని రోజులుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకున్న వాటిలో మౌనిక ప్రజావైద్యశాల, మౌనిక స్కానింగ్ సెంటర్, రాఘవేంద్ర మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి, సూరజ్ క్లినిక్, గద్వాల మల్టీ కాంప్లెక్స్ ఆస్పత్రి, నిర్మల నర్సింగ్‌హోం, వైష్ణవి ఆస్పత్రి, అమ్మ వైద్యశాల, ఎస్ఎస్ డయాగ్నొస్టిక్, లక్ష్మీ క్లినిక్‌లు ఉన్నాయి. వైద్యారోగ్యశాఖ చర్యల నుంచి తప్పించుకునేందుకు ఆస్పత్రుల యాజమాన్యాలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. తెలిసిన నాయకులతో మంతనాలు సాగిస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పేందుకు సైతం ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం.

# జూరాలకు తగ్గిన వరద

- ప్రాజెక్టుకు 6,691 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌కు కొనసాగుతున్న నీటి పంపింగ్



**ధరూరు/ రాజోళి/ మదనాపురం/ దోమలపెంట:** ఉమ్మడి జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 6,691 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 875 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు వదలగా మరో 139 క్యూసెక్కులు ఆవిరి అయ్యింది. దీంతో మొత్తం ప్రాజెక్టు నుంచి 2,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.869 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**సుంకేసుల నుంచి నీటి విడుదల**

సుంకేసుల డ్యాంలో ఒక గేటు ద్వారా నీటి విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో డ్యాంకు వరద నీరు వచ్చి చేరుతుంది. సోమవారం ఎగువ నుంచి 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును తెరిచి 3,065 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు ఆయన చెప్పారు.

**రామన్‌పాడుకు 800 క్యూసెక్కులు**

రామన్‌పాడు జలాశయంలో నీటి నిల్వ పెరుగుతోంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేయగా.. సమాంతర కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. దీంతో జలాశయం నుంచి తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

**శ్రీశైలంలో 813.1 అడుగులు..**

శ్రీశైలం జలాశయంలో సోమవారం 813.1 అడుగుల వద్ద 36.1392 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 3,065 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. జలాశయంలో 82 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


గణేష్(ఫైల్)

అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని లింగోటం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పునుంతల మండలం కట్లబండ తండాకు చెందిన సబావత్ గణేష్(32) అచ్చంపేట కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగా ఇంటి నుంచి బైక్‌పై అచ్చంపేటలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లాడు. పని ముగించుకొని అర్ధరాత్రి వేళ ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో లింగోటం శివారులోని ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారి పక్క గుంతలో పడ్డాడు. ముక్కు, చెవి నుంచి తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి అయిన ఎంతకు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా కలవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. రాత్రి సుమారు 1.30 గంటల ప్రాంతంలో తెలిసిన వ్యక్తి కుటుంబ సభ్యులకు గణేష్ మృతిపై సమాచారం ఇచ్చాడు. దీంతో అతని భార్య పూజిత, కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రాములు పేర్కొన్నారు. అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రి వద్ద మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు.

### పురుగు మందు తాగి ఆత్మహత్య


అనిల్‌కుమార్ (ఫైల్)

దేవరకద్ర: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం కౌకుంట్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (28) కుటుంబ సమస్యలతో సతమతమవుతూ సోమవారం పురుగుల మందు తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని తెలిపారు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### కుక్కల దాడిలో 75 గొర్రెపిల్లలు మృతి



చిన్నచింతకుంట: కుక్కల దాడిలో 75 గొర్రె పిల్లలు మృతిచెందిన సంఘటన చిన్నచింతకుంట మండలం పర్దిపురంలో సోమవారం చోటుచేసుకుంది. గొర్రెల కాపరులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూజారి శ్రీశైలం, పూజారి చెవిటి మల్లప్ప, పూజారి కావలి మల్లప్ప గ్రామ సమీపంలో చిన్న గొర్రెపిల్లలను వలలో ఉంచి మిగితా గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. ఎవరూ లేని సమయంలో కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేసి చంపేసినట్లు గొర్రెల కాపరులు తెలియజేశారు. పూజారి శ్రీశైలం 25 గొర్రె పిల్లలు, పూజారి చెవిటి మల్లప్పవి 25, పూజారి కావలి మల్లప్పవి 25 గొర్రె పిల్లలు మృతిచెందినట్లు వివరించారు. గొర్రె పిల్లల మృతితో దాదాపుగా రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని కాపర్లు ఆరోపించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### శ్మశాన వాటికలో అనుమానాస్పద గుంతలు

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ శ్మశాన వాటిక సమీపంలో రెండు గుంతలు తవ్వి పూడ్చివేయడం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలు తవ్వి పూడ్చిన ప్రాంతంలో మట్టి కుంగిపోయింది. ఆ ప్రాంతంలో ఒక బీరు బాటిల్, ఇతర వస్తువులు పడి ఉండటంతో చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. అయితే మధ్యాహ్నం తహసీల్దార్ వెంకట్రామ్‌కు రేవులపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ సమాచారం అందించగా.. బక్రీద్ సెలవు కావడంతో ఆయన రాలేదు. సాయంత్రం 6.30 గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ అనుమానిత ప్రాంతానికి చేరుకుని పోలీసులతో కలిసి పరిశీలించారు. మంగళవారం ఉదయం గుంతలను వెలికితీసి ఏమిటనే విషయాన్ని చెబుతామని విలేకరులకు చెప్పారు. రాత్రికి పోలీసులతోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడే కాపలా ఉండాలని అధికారులు సూచించారు.

### రిమాండ్‌కు తరలింపు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీఆర్ కాలనీలో అల్లుడిని చంపిన మామ కేసులో.. నిందితుడు మద్దిలేటిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జైల్‌కు పంపించామని సీఐ రవిబాబు తెలిపారు. కాగా ఈనెల 16న జరిగిన ఘటనలో దేవేందర్ అనేవ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే.

# అటవీ పార్కు ముస్తాబు


కొల్లాపూర్ నుంచి సోమశిలకు వెళ్లే దారిలో నిర్మిస్తున్న అటవీ పార్కు

**కొల్లాపూర్ నుంచి సోమశిలకు వెళ్లే దారిలో నిర్మాణం**

- 80 శాతం మేరకు పనులు పూర్తి
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి..
- పార్కుకు అనుసంధానంగా నల్లమల ఫారెస్టు వ్యూపాయింట్
- అక్కడి నుంచి చూస్తే సోమశిల, కృష్ణానది, నల్లమల అందాల కనువిందు

కొల్లాపూర్: నల్లమల అటవీ అందాలను తిలకించేందుకు మరో వ్యూపాయింట్ సిద్ధమవుతోంది. అమ్రాబాద్ వ్యూ పాయింట్ తరహాలో కొల్లాపూర్ సమీపంలో కూడా అటవీ అధికారులు వ్యూపాయింట్‌ను ఏర్పాటుచేస్తున్నారు. అడవులపై అవగాహన, జంతు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అందాల గురించి ప్రజలకు తెలియజేయాలనే లక్ష్యంతో అధికారులు అడవుల్లో పార్కుల నిర్మాణంతో పాటు, వ్యూపాయింట్ నిర్మాణాల వంటి విభిన్న అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**రూ.1.50 కోట్లతో నిర్మాణం..**

కొల్లాపూర్ – సోమశిల దారిలోని అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు నాలుగేళ్ల క్రితం పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్వాతి కాలంలో పార్కు సమీపంలోని అటవీ ప్రాంతంలో వ్యూ పాయింట్ నిర్మించాలని నిర్ణయించారు. అందుకోసం రూ.1.50 కోట్లను హరిత, టీకేహెచ్ఎస్ ద్వారా కేటాయించారు. అయితే నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయనే ప్రచారం ఉంది. అక్టోబర్ నుంచి మార్చి వరకు కొల్లాపూర్, సోమశిల ప్రాంతాలకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అప్పటిలోగా పార్కు, వ్యూ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.


అడవిలో ఏర్పాటుచేసిన వ్యూ పాయింట్

**అద్భుతంగా వ్యూపాయింట్..**

పార్కు నుంచి అటవీ ప్రాంతం లోపల ఎత్తయిన ప్రాంతంలో వ్యూపాయింట్‌ను నిర్మించారు. పార్కు నుంచి వ్యూపాయింట్‌కు వెళ్లేందుకు వీలుగా కిలోమీటర్ మేర మట్టి రోడ్డు ఏర్పాటుచేశారు. రోడ్డుకు ఇరువైపులా ట్రెంచ్, కంచె ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు నిర్మాణాలు కూడా కొంత మేరకు పూర్తి చేయాల్సి ఉంది. నిధుల సమీకరణలో ఆలస్యం అవుతున్న కారణంగా పనుల్లో జాప్యం జరుగుతూ వస్తోంది. వ్యూ పాయింట్ నుంచి చూస్తే సోమశిల, సమీపంలోని కృష్ణానది, కర్నూల్ జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు నల్లమల అభయారణ్యం దృశ్యాలు కనువిందు చేస్తాయి. పక్షులు, జంతువుల కదలికలు కూడా పర్యాటకులను ఆహ్లాదపర్చనున్నాయి. పార్కు ప్రారంభమైతే పర్యాటకుల ప్రవేశ రుసుమును జూ అండ్ పార్కు నిర్వహణ మేరకు అటవీ అధికారులు నిర్ణయించనున్నారు.

**పెరుగుతున్న జంతు సంచారం..**

కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో 9 వరకు పెద్దపులులు, 25 చిరుతలు, 30 ఎలుగుబంట్లు, 500 పైగా జింకలు, సాంబార్లు, కడితి, దుప్పి వంటి జంతువులు ఉన్నాయి. వన్యప్రాణుల సంచారాన్ని గుర్తించేందుకు 40కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అంకలిపెంట, ముద్దునూటి పెంట, పెగ్గర్లపెంట, ఎర్రపెంట, పెద్దూటి, మినుమూటి పెంట ప్రాంతాల్లో జంతువుల సంచారం అధికంగా ఉంటుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని నూతనంగా నిర్మిస్తున్న పార్కు, వ్యూపాయింట్ ప్రాంతాల్లో పర్యాటలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన రక్షణ చర్యలు కూడా ఫారెస్టు అధికారులు చేపట్టబోతున్నారు. వ్యూపాయింట్‌కు వెళ్లేవారి కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలోనే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయనున్నారు.

**అందుబాటులోకి తీసుకురావాలి**



అటవీ ప్రాంతంలోకి సామాన్యులు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఉంటాయి. అటవీ అందాలు తిలకించేందుకు వీలుగా ఫారెస్టు అధికారులు వ్యూ పాయింట్ ఏర్పాటుచేయడం, పార్కు నిర్మించడం స్వాగతించదగ్గ అంశం. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలి. పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడంతో పాటు రక్షణపరమైన అంశాలపై కూడా అధికారులు దృష్టి సారించాలి.

– కోళ్ల శివప్రసాద్, తాళ్లనర్సింగాపురం

**రెండు నెలల్లో పూర్తిచేసేందుకు చర్యలు..**



ఫారెస్టు వ్యూపాయింట్ నిర్మాణం పూర్తయింది. పార్కులో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇప్పటికే కొల్లాపూర్‌లోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వ్యూపాయింట్‌ను సందర్శించారు. అన్ని వసతులు సమకూర్చిన తర్వాతనే అధికారికంగా వీటిని ప్రారంభిస్తాం. అడవులు, జంతు పరిరక్షణ అంశాలపై పర్యాటకులకు అవగాహన కల్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్మాణ పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం.

– శరత్‌చంద్రారెడ్డి, ఎఫ్ఆర్ఓ, కొల్లాపూర్

# ఇసుకాసురుల కొత్త దందా

- తోటలో ఇసుక డంపు

అమరచింత: ఇసుక వ్యాపారులు తమ వ్యాపారానికి కొత్త అడ్డాలు వెతుక్కుంటున్నారు. డంపు చేసుకున్న ఇసుక తరలించే యత్నంలో పోలీసులకు సమాచారం అందడంతో ఇసుక డంపును స్వాధీనం చేసుకుని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరచింత శివారులో కృష్ణనాయక్ పండ్ల తోటలో ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచారని తెలియడంతో సోమవారం సిబ్బందితో వెళ్లి అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించామన్నారు. నిల్వ చేసిన ఇసుకను గురించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు విన్నవించామన్నారు. కొన్ని రోజులుగా పట్టణానికి చెందిన కొంత మంది మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లోని ఊకచెట్టి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు శ్రీకారం చుట్టారు. అల్లీపూర్ నుంచి నిత్యం రాత్రిళ్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకొచ్చి అమరచింత శివారులోని కృష్ణనాయక్‌కు చెందిన తోటలో ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. సుమారు 200 పైగా ట్రాక్టర్ల ఇసుక డంప్‌లో కొంత మేరకు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించుకున్నారు. మిగిలిన డంప్‌ను తరలించేందుకు యత్నిస్తుండగా.. అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే విషయం వెలుగు రావడంతో ఇసుకాసురుల బాగోతం బయటపడింది. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే అక్రమంగా ఇసుకను తరలించే వ్యాపారం చేస్తున్నారని తెలిసింది.


ఇసుక డంప్ వద్ద ఎస్ఐ సురేష్ కుమార్

### పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

జడ్చర్ల: పశువులను వధిస్తున్నారనే సమాచారంతో బీజేపీ యువ నాయకులు ఆయా పశువులను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో పట్టణంలోని ముస్లింలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కావేరమ్మపేటలో సోమవారం నాలుగు పశువులను వధిస్తున్నారనే అనుమానంతో కొందరు బీజేపీ యువకులు ఆయా పశువులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వందలాది మంది ముస్లింలు మసీద్‌లో ప్రార్థనలు చేసిన అనంతరం ఒక్కసారిగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పశువులను పట్టుకున్న యువకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. పెద్దఎత్తున నినదించారు. పశువులను పట్టుకునే హక్కు వారికి ఎవరు ఇచ్చారంటూ ప్రశ్నించారు. అనంతరం వైద్యులు పశువులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం పోలీసులకు అందజేయడంతో ఆయా పశువులను విడిచిపెట్టారు. దీంతో ఉద్రిక్తత సద్దుమనిగింది. కాగా ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే నేరం అవుతుందని ఈ సందర్భంగా సీఐ తెలియజేశారు. తమకు సమాచారం అందిస్తే పూర్వాపరాలను విచారించి, చర్యలు తీసుకుంటామన్నారు.

### గుడిలో చోరీకి యత్నం: వ్యక్తిపై కేసు నమోదు

మహమ్మదాబాద్: గుడిలో చోరీ చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తి పోలీసులకు పట్టుబడిన సంఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామ శివాలయంలో అదే గ్రామానికి చెందిన అరువ వెంకటయ్య 17తేదీ తెల్లవారుజామున ఆలయం ఆవరణలో ఉన్న కొన్ని సామగ్రిని చోరీ చేసే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన పోలీసుల కంట పడటంతో ఆయనను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, అసలు విషయం చెప్పాడు. ఈ మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసినట్టు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

# ఫారెస్ట్ అధికారులకు నెమళ్ల అప్పగింత


ఉండవెల్లిలో నెమలిని పోలీసులకు అప్పగించిన యువకులు


మద్దూరు మండల పరిధిలో నెమలిని అధికారులకు అప్పగిస్తున్న రైతు నరోత్తంరెడ్డి

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు శివారులోని పంట పొలాల్లో నెమలిని కుక్కలు వెంటాడుతుండగా యువకులు అడ్డుకున్నారు. ఈ మేరకు నెమలిని తీసుకువెళ్లి సోమవారం ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ సుబ్బారెడ్డికి అప్పగించారు. కాగా నెమలి అనారోగ్యంతో ఉండడంతో చికిత్స కోసం పంపించారు. ఈమేరకు పశువైద్యాధికారి శిరీషా చికిత్స చేశారు. అనంతరం నెమలిని అటవీ శాఖ సిబ్బంది కీర్తికి అప్పగించారు. కాగా మహబూబ్‌నగర్ పార్క్‌కు నెమలిని తరలించినట్లు వివరించారు. కంచుపాడు యువకులు గునవర్ధన్ గౌడ్, పరుశరాముడు, పోలీస్ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

**మద్దూరు మండలంలో..**

మద్దూరు: మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో రైతు నరోత్తంరెడ్డి పొలంలో ఆదివారం సాయంత్రం గాయమైన నెమలి కనిపించింది. దీంతో రైతు దానిని ఇంటికి తీసుకొచ్చి ప్రథమచికిత్స చేయించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మండల బీట్ అధికారి లక్ష్మణ్ తన సిబ్బందిని పంపించగా నరోత్తంరెడ్డి వారికి నెమలిని అప్పగించారు. కాగా దానిని దౌల్తాబాద్ మండలంలోని గోకపస్లావాద్ అడవిలో వదిలివేసినట్లు అధికారులు తెలిపారు.

# అనుక్షణం భయం..భయం

- చిరుతల సంచారంతో ఆందోళన

నవాబుపేట: మండలంలోని అడవిలో చిరుతల సంచారంతో ప్రజలు భయం.. భయంగా గడుపుతున్నారు. ముఖ్యంగా అడవికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నామని చెబుతున్నారు. తరచూ ఎదో ఒక భయంకరమైన అడవి జంతువు జాడలు కనిపించటం... దాంతో కొన్ని రోజులు ఆందోళన చెందడం.. తరువాత మళ్లీ అడవి మార్గాన వెళ్లాల్సిరావడం వారికి పరిపాటిగా మారింది. మండలపరిధిలో మొగుళ్లపల్లి, వీరశెట్టిపల్లి, చాకలపల్లి, కొత్తపల్లి, నీర్‌సాబ్‌తండాలు అడవికి ఆనుకుని ఉంటాయి. ఈ గ్రామాల వారు నిత్యం తమ పొలాలకు అడవి మార్గంలోనే వెళ్లాల్సి ఉంటుంది. కాగా ఆయా గ్రామాల్లో తాజాగా చిరుత సంచారం కలకలం రేపింది. వారం రోజులుగా మొగుళ్లపల్లి శివారులో చిరుత సంచరిస్తోందని.. పశువుల కాపరులు తెలిపారు. కాగా అది వెళ్లిపోయిందనుకుంటున్న తరుణంలో మరో ఘటన చోటుచేసుకుంది. చాకలపల్లి పంచాయతీ పరిధిలోని నీర్‌సాబ్‌తండా వాసి బీక్యానాయక్‌కు చెందిన ఆవుదూడను రెండు రోజుల క్రితం తెల్లవారుజామున పశువుల కొటంపై మాటు వేసి చంపి తినేసింది. కాగా రైతు పాలు తీసుకురావడానికి కొటం దగ్గరకు రాగానే అలజడితో అదిక్షణాల్లో పారిపోయిందని రైతు వివరించాడు.


గ్రామాలను ఆనుకుని ఉన్న అడవి

**ఘటనలు ఇలా..**

- మూడు సంవత్సరాల క్రితం చాకలపల్లి సమీపంలోని తండాకు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు అడవి పందుల నుంచి రక్షణకు వేసిన వలలో చిరుత చిక్కుకున్న ఘటనసైతం సంచలనం రేపింది.
- ఫిబ్రవరిలో మొగుళ్లపల్లి శివారులో పశువుల కాపరులకు చిరుత పరుగెత్తటం కనిపించింది.
- గత జనవరిలో నీర్‌సాబ్‌తండాలో లేగదూడపై చిరుత దాడి చేసింది.
- తాజాగా నాలుగు రోజుల క్రితం కొత్తపల్లి గ్రామానికి అతి సమీపంలో శేఖర్ అనే యువకుడిపై చిరుత దాడి చేసి గాయపరిచింది.

**చిరుత సంచారం మామూలైంది.**



చిరుత సంచారం మా గ్రామనికి మామూలైంది. కానీ చిరుత కనిపించిందన్న సమయంలో మాత్రం చెప్పలేని భయం కలుగుతోంది. ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందోనని ఆందోళనలో ఉంటాం. కానీ మా పొలాలకు అడవి నుంచె వెళ్ళాల్సి ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఐదారుగురం కలిసి వెళ్తుతుంటాం. అధికారులు స్పందించి ప్రత్యేక బోన్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ సీజన్లో రైతులకు భరోసా కల్పించాలి.

–రాములు, మొగుళ్లపల్లి

# బీసీ కులగణన చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కుల గణన చేపట్టి బీసీల జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందన్నారు. కాని ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు, బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే చేసి రిజర్వేషన్లు అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. వివిధ రకాలుగా సాకులు చూపెట్టి వాయిదా వేయడం మానుకోవాలన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీల పాత్ర ఏంటో చూపెట్టి, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, జాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు డీకే నాయి, బీసీ సమాజ్ కో కన్వీనర్ సవారి సత్యం, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి.శేఖర్, బీసీ సమాజ్ నాయకులు జంగం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పసివాడి ప్రాణానికి బాధ్యులెవరు?

రాజాపూర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదివారం ఓ పసివాడి ప్రాణం గాల్లో కలిసిన విషయం విధితమే. నిండు నూరేళ్లు జీవించాల్సిన చిన్నారి అర్ధాంతరంగా తనువు చాలించాల్సి వచ్చింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన అండర్ డ్రెయినేజీ పైప్‌లైన్ పగిలిపోయి మురుగు రోడ్డుపై పారుతోంది. పైప్‌లైన్‌కు మరమ్మతు చేయకుండా రోడ్డుపైకి మురుగు రాకుండా గుంతను తీసి వదిలేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రానికి చెందిన శివ, లావణ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. కుమారుడు జశ్వంత్ ఆడుకుంటూ గుంతలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు. ప్రమాదకరంగా ఉన్న నీటిగుంతపై గతంలోనే సాక్షి హెచ్చరించినా అధికారులు చర్యలు చేపట్టలేదు. చివరికి పసివాడి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు కళ్లుతెరిచి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. మరో ప్రమాదం జరగముందే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.


చిన్నారిని మింగిన మురుగు నీటి గుంత

# ఇన్‌స్టాలో పరిచయం.. పెళ్లి చేసుకొని మోసం

- పోలీసులను ఆశ్రయించిన యువతి

గద్వాల క్రైం: సామాజిక మాధ్యమంలో వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరువురి కుటుంబాలకు తెలియకుండా రహస్యంగా వివాహం చేసుకున్నారు. రెండునెలల వ్యవధి అనంతరం తన కుటుంబ సభ్యులను కలిసి వస్తానని చెప్పి వెళ్లిన భర్త.. నేటి వరకు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన యువతి స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఈఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. బాధితురాలి వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా కోట మండలంలోని చిట్టెడు గ్రామానికి చెందిన నిహారికకు ఇన్‌స్టాగాంలో వడ్డేపల్లి మండలం ఏ బూడిదపాడుకు చెందిన బషీర్‌తో 2023లో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో ఇరువురి అభిప్రాయాలు, స్థితిగతులను తెలియజేసుకున్నారు. గతంలోనే తనకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని.. మొదటి భర్త వదిలేసినట్లు నిహారిక బషీర్‌కు తెలియజేయగా.. తాను వివాహం చేసుకుంటానని నమ్మించాడు. గత మార్చి 18వ తేదీన వారిద్దరు తిరుపతిలో రహస్యంగా వివాహం చేసుకున్నారు. అయితే 15 రోజుల క్రితం బషీర్ తన కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురయ్యారని.. స్వగ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. నిహారిక పలుమార్లు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ సమాధానం వచ్చింది. దీంతో బషీర్ కుటుంబ సభ్యులను సంప్రదించగా, సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. ఈక్రమంలో వారం రోజుల క్రితం ఎస్పీ రితిరాజ్‌ను నిహారిక కలిసి తన గోడును వెల్లబోసుకోగా.. ఇరువురికి భరోసా కేంద్రంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ నీతో మాకు ఎలాంటి సంబంధం లేదని బషీర్, అతడి కుటుంబ సభ్యులు పర్కొంటూ.. తనపై దాడికి యత్నిస్తున్నారని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. ఈఘటనపై శాంతినగర్ ఎస్ఐ సంతోష్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ.. పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు జరిగిన అన్యాయంపై గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఈవిషయంపై శాంతినగర్ ఎస్ఐ సంతోష్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనని.. తనకు కేసు అవసరం లేదని, తన భర్త తనతో కలిసి జీవిస్తే చాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో ఇరువురి కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడుకోవాలని కొంత సమయం ఇచ్చానని అన్నారు. కేసు నమోదులో నిర్లక్ష్యం చేయడం అనేది అవాస్తమని పేర్కొన్నారు. బాధితురాలు కేసు నమోదు చేయమంటే తప్పకుండా కేసు నమోదు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కల్వకుర్తిరూరల్: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా మారిన ఘటన మార్చాల, తాండ్ర గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కల్వకుర్తికి చెందిన తరుణ్ ఎంగంపల్లి రోడ్డు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మలుపు వద్ద జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో అతనికి గాయాలయ్యాయి. కల్వకుర్తిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. మార్చాల కాటన్ మిల్లు సమీపంలో వస్తున్న లారీకి సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై వెళ్తూ లారీని ఢీకొని గాయపడ్డాడు. మండలంలోని తాండ్ర సమీపంలో వేగనిరోధానికి ఏర్పాటు చేసిన బారికేడ్‌లకు ద్విచక్రవాహనంతో ఢీకొని కల్వకుర్తికి చెందిన వెంకటేష్ తీవ్రంగా గాయపడడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ప్రమాదాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిలో అయ్యవారిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం సాయంత్రం శ్రీశైలం నుంచి డిండి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సంగారెడ్డికి చెందిన వెంకటయ్య, విష్ణువర్ధన్, ప్రవీన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. సంగారెడ్డికి చెందిన ఐదు మంది కారులో శ్రీశైలం వెళ్లి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది.

### జాతీయ రహదారిపై స్కార్పియో వాహనం బోల్తా


అదుపు తప్పి కల్వర్టులో బోల్తాపడిన స్కార్పియో వాహనం


ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

అలంపూర్: జాతీయ రహదారిపై స్కార్పియో వాహనం బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అలంపూర్ చౌరస్తాలో ఉత్తరఫీడ్స్ కంపెనీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలం రంగాపురం నుంచి కర్నూల్‌కు వెళ్తున్న స్కార్పియో వాహనం ఉత్తరఫీడ్స్ కంపెనీ సమీపంలోని కల్వర్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో స్కార్పియో డ్రైవర్ శివకుమార్, దీపక్ గుప్తా, హుసేనయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. స్కార్పియో వాహనం కల్వర్టులో బోల్తా పడటంతో హైదరాబాద్ నుంచి కర్నూల్ రహదారిలో రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి.